batukammanews.com TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

7 ఆగస్టు 2026
శుక్రవారం



ఈ నెలాఖరులోగా

# లిఫ్ట్ పనులు పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**

02

మాక్లూర్, బతుకమ్మ :ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని మాక్లూర్ మండలంలోని బొంకలపల్లి, ముల్లంగి గ్రామాల పరిధిలో జరుగుతున్న లిఫ్ట్ వాటర్ రీఛార్జ్ పనులను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లిఫ్ట్ వాటర్ రీఛార్జ్ పూర్తయితే దాదాపు 1000 ఎకరాలకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరులోగా లిఫ్ట్ ద్వారా నీరు అందేలా పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లిఫ్ట్ ద్వారా నీరు ప్రవహించే కాలువలను రైతులు కూడా మరమ్మతులు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి సర్పంచ్ ధర్మపతి నూతల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జీపీఓ

వెబ్ డెస్క్, బతుకమ్మ :జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం అథ్మకూర్ గ్రామంలో గ్రామ పాలన అధికారి (జీపీఓ) లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గురువారం ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో అథ్మకూర్ గ్రామానికి చెందిన జీపీఓ మాతే రాజేష్ (37) పట్టుబడ్డారు.

02






వర్షాల ధాటికి

- కాంట్రాక్టర్ బ్లాక్‌లిస్ట్
- టోల్ వసూళ్లకు బ్రేక్

# 64 కి.మీ ఎక్స్ ప్రెస్‌వే ధ్వంసం

వెబ్ డెస్క్, బతుకమ్మ :భారీ వర్షాల కారణంగా లక్నో - కాన్పూర్ ఎక్స్ ప్రెస్ వే పై 64 కిలోమీటర్ల మేర రహదారి తీవ్రంగా దెబ్బతినడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. నాసిరకంగా రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ కంపెనీని బ్లాక్‌లిస్ట్ లో చేర్చడంతో పాటు, ఆ మార్గంలోని టోల్‌గేట్ వసూళ్లను తక్షణమే నిలిపివేసింది. ధ్వంసమైన 64 కిలోమీటర్ల రహదారిని కాంట్రాక్టర్ సంస్థ తన సొంత ఖర్చులతో పూర్తిగా పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆదేశించింది. మరమ్మతులు పూర్తయిన అనంతరం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాతే టోల్ వసూళ్లకు మళ్లీ అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. అప్పటి వరకు టోల్‌గేట్‌ను తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎక్స్ ప్రెస్ వే పై ప్రస్తుతం కార్లకు రూ.275, బస్సులకు రూ.1,000 వరకు టోల్ ఫీజు వసూలు చేస్తున్న నేపథ్యంలో, నాసిరకం నిర్మాణంతో రహదారి దెబ్బతినడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో నిర్మాణ పనులను పరిశీలించి బిల్లులకు ఆమోదం తెలిపిన నేషనల్ హైవే అథారిటీకి చెందిన ఇంజినీర్లు, ఇతర సిబ్బందిపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.వారిని సస్పెండ్ చేయడంతో పాటు, ఉన్నతాధికారులను వారి అసలు శాఖలకు పంపిస్తూ తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. అంతే కాకుండా, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కన్సల్టెంట్లు, సైట్ ఇంజినీర్లు, వారి సంస్థలను కూడా బ్లాక్‌లిస్ట్ లో చేర్చుతూ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజాధనంతో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో బాధ్యులపై కఠిన చర్యలు కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.





వేములవాడ రాజరాజేశ్వర స్వామి

# ఆలయాన్ని సందర్శించిన డీఐజీ



రాజన్న సిరిసిల్ల, బతుకమ్మ: రాజన్న జోన్ - 3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ వేములవాడలోని ప్రముఖ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దక్షిణకాశిగా పేరుగాంచిన వేములవాడ ఆలయానికి దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డీఐజీ అధికారులను ఆదేశించారు.ఆలయ పరిసరాల్లో నిరంతర గస్తీ నిర్వహించడం, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ చేపట్టడం, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే డీఐజీకి స్వాగతం పలికి, ఆలయ భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై వివరాలు అందించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సందర్శకులతో కిటకిటలాడుతున్న

# జానకిబాయి వాటర్ ఫాల్స్

**సిర్నాపల్లి చెరువు అలుగు పారడంతో పెరిగిన పర్యాటకుల రద్దీ**

ఇందల్వాయి, బతుకమ్మ:ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గ్రామంలోని జానకిబాయి చెరువు అలుగు పారుతుండటంతో ఆ ప్రాంతం సందర్శకులతో సందడిగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువు నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తూ అందమైన జలపాతంలా కనిపిస్తుండడంతో సిర్నాపల్లి వాటర్ ఫాల్స్‌ను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు.



02

# మైనర్లకు కల్లు విక్రయాలు

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతార్
- బోర్డులకే పరిమితమవుతున్న వైనం
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులుతంతంతంతంత

02

# మైనర్లకు కల్లు విక్రయాలు






రుద్రూర్ (వర్ని), బతుకమ్మ :వర్ని మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న కల్లు దుకాణాల సముదాయంలో ప్రభుత్వ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం 21 సంవత్సరాల లోపు వారికి కల్లు విక్రయించడం నిషేధం. ఈ మేరకు దుకాణాల ముందు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని కొందరు వ్యాపారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాపార లాభాలే లక్ష్యంగా మైనర్ బాలురకు కూడా కల్లు విక్రయిస్తున్నారని, ప్రభుత్వ ఆబ్కారీ చట్టాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టాలు అమలులో ఉన్నాయా లేక కేవలం బోర్డులకే పరిమితమయ్యాయా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మైనర్లకు మత్తు పానీయాల విక్రయం వారి ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. అయినప్పటికీ కొందరు దుకాణాల యజమానులు నిబంధనలను విస్మరించి విక్రయాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సందర్శకులతో కిటకిటలాడుతున్న జానకిబాయి వాటర్ ఫాల్స్

గ్రామ చరిత్ర ప్రకారం, సుమారు 200 సంవత్సరాల క్రితం సంస్థాన్ సిర్నాపల్లి పాలకురాలు శ్రీమతి జానకిబాయి రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భారీ చెరువును నిర్మించారు. ఈ చెరువుకు దాదాపు 40 అడుగుల ఎత్తైన అలుగును ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. అప్పట్లో నిర్మించిన ఈ చెరువు ప్రస్తుతం ప్రకృతి అందాలతో పర్యాటకులను ఆకర్షిస్తోంది. వర్షాలతో చెరువు అలుగు నుంచి నీరు ప్రవహించడం ప్రారంభమైనప్పటి నుంచి సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని గ్రామస్తులు తెలిపారు. పర్యాటకుల రాకతో సిర్నాపల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని సర్పంచ్, ఉప సర్పంచ్ పేర్కొన్నారు. ఒకప్పుడు నక్సలైట్ ప్రభావిత గ్రామంగా గుర్తింపు పొందిన సిర్నాపల్లి ప్రస్తుతం శ్రీ జానకిబాయి చెరువు జలపాతంతో కొత్త ఆకర్షణగా మారిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి జలపాతాన్ని వీక్షిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. సిర్నాపల్లి వాటర్ ఫాల్స్‌ను అధికారికంగా పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా అధికారులు, కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఈ నెలాఖరులోగా లిఫ్ట్ పనులు పూర్తి చేయాలి

మాక్లూర్, బతుకమ్మ :ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని మాక్లూర్ మండలంలోని బొంకలపల్లి, ముల్లంగి గ్రామాల పరిధిలో జరుగుతున్న లిఫ్ట్ వాటర్ రీఛార్జ్ పనులను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లిఫ్ట్ వాటర్ రీఛార్జ్ పూర్తయితే దాదాపు 1000 ఎకరాలకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరులోగా లిఫ్ట్ ద్వారా నీరు అందేలా పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లిఫ్ట్ ద్వారా నీరు ప్రవహించే కాలువలను రైతులు కూడా మరమ్మతులు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి సర్పంచ్ ధర్మపతి నూతల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ జీపీఓ

ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అథ్మకూర్ గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడి పట్టా పాస్‌బుక్‌లో పేరు సవరణకు సంబంధించిన విచారణ నివేదికను ఉన్నత రెవెన్యూ అధికారులకు సమర్పించేందుకు జీపీఓ రాజేష్ రూ.5 వేల లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారు నుంచి లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం మొత్తాన్ని తన హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టాలని నిందిత అధికారి ఫిర్యాదుదారుడికి సూచించినట్లు ఏసీబీ వెల్లడించింది. అనంతరం ఆ బ్యాగ్ నుంచి రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిర్వహించిన రసాయన పరీక్షల్లో బ్యాగ్‌కు పాజిటివ్ ఫలితం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనం పొందినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు రాజేష్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కరీంనగర్‌లోని స్పెషల్ జడ్జి ఫర్ ఎస్‌పీఈ అండ్ ఏసీబీ కేసుల కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై

# దశలవారీ పోరాటానికి యుఎస్పిసి పిలుపు

**ఆగస్టు 7 నుంచి నిరసనలు**

**29 న ఇందిరా పార్క్ లో మహాధర్నా**

**స్పందించకుంటే సెప్టెంబర్‌లో చలో అసెంబ్లీ**



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్ పిసి) నిర్ణయించింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 7 నుంచి పాఠశాల స్థాయి నిరసనలతో ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు యుయస్పిసి నిజామాబాద్ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు యానాం విజయ్ కుమార్, శంతన్, సత్యానంద్, ఒమాజీ, సుధాం, పెంటన్న, లింగన్న తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యుయస్పిసి నాయకులు ఆరోపించారు. అధికారుల వైఖరి కారణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగానికి 15 శాతం నిధుల కేటాయింపు హామీని ప్రభుత్వం విస్మరించిందని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతుల నిర్వహణలో ప్రభుత్వం స్పష్టమైన విధానం పాటించడం లేదని అన్నారు. ప్రీప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నిర్వహించడం వల్ల చిన్నారుల సంరక్షణపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యకు నష్టం కలిగించే జీఓ 25ను సవరించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులు, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ ఈఓ పోస్టులు, అన్ని మండలాలకు ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్ నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల ఖాళీలను భర్తీ చేయాలని, ఆగస్టు 15లోగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరారు. టెట్‌లో సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని, ప్రత్యేక టెట్‌ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, గురుకులాల టైంటేబుల్ మార్పులు చేయాలని, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీఓ 190 అమలు, ఐదు విడతల కరువు భత్యం (డీఏ) విడుదల, పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయడం, పెండింగ్ బిల్లులను ప్రతినెలా రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేయడం, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**పోరాట కార్యాచరణ ఇలా..**

యుయస్పిసి ప్రకటించిన కార్యాచరణ ప్రకారం ఆగస్టు 7న పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపట్టనున్నారు. అదే రోజు నుంచి పీఆర్సీ ప్రకటించే వరకు ప్రతిరోజూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి తహసీల్దార్లకు మెమోరాండాలు అందజేయనున్నారు. ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నారు. ఆగస్టు 21 నుంచి 26 వరకు రాష్ట్ర, జిల్లా స్థాయి బృందాలు పర్యటించి జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించనున్నాయి. ఆగస్టు 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల అనంతరం కూడా ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడతామని యుయస్పిసి నాయకులు ప్రకటించారు. ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐక్య పోరాటానికి కలిసి రావాలని, సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులంతా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమంలో పాల్గొనాలని యుయస్పిసి పిలుపునిచ్చింది.

# రాజకీయ స్థాయికి తగ్గట్టుగా లేవు

**బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి**

హైదరాబాద్, బతుకమ్మ :గాంధీభవన్ వేదికగా సాయికుమార్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా, రాజకీయ స్థాయికి తగ్గట్టుగా లేవని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురిపై తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అర్వింద్ ధర్మపురి ప్రజా మద్దతుతో వరుసగా రెండోసారి ఎంపీగా గెలిచిన నాయకుడని, తెలంగాణ ప్రజల గొంతుకగా పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారని దినేష్ పటేల్ అన్నారు. అర్వింద్ ధర్మపురి గతంలో నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవితను ఓడించి సంచలనం సృష్టించారని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిపై విజయం సాధించి మరోసారి ఎంపీగా ఎన్నికయ్యారని ఆయన గుర్తుచేశారు. ఇందూరు జిల్లాలో అర్వింద్‌కు ప్రజాబలం ఉందని, ఆయన నాయకత్వంలో పెద్ద సంఖ్యలో సర్పంచులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు విజయం సాధించారని దినేష్ పటేల్ పేర్కొన్నారు. అలాంటి ప్రజా ప్రతినిధిపై వ్యక్తిగత ఆరోపణలు చేయించడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు రాజకీయ విమర్శల స్థాయిని దాటి వ్యక్తిగత దూషణలుగా మారుతున్నాయని ఆయన విమర్శించారు. అర్వింద్ ధర్మపురి ఎప్పుడూ అనుచిత భాషను ఉపయోగించే నాయకుడు కాదని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో సాయికుమార్ చేసిన వ్యాఖ్యలపై అక్కడున్న కాంగ్రెస్ నాయకులే అసహనం వ్యక్తం చేశారని దినేష్ పటేల్ అన్నారు. ఎంపీ అర్వింద్ ధర్మపురిపై చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, అనుచిత వ్యాఖ్యలు చేసిన సాయికుమార్‌ను ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని బీజేపీ కొనసాగిస్తుందని, అర్వింద్ ధర్మపురి వంటి నాయకులపై చేస్తున్న విమర్శలు రాజకీయంగా ఎదురుదెబ్బలేనని దినేష్ పటేల్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ చిన్నమ్మ సుష్మా స్వరాజ్‌కు బీజేపీ నేతల ఘన నివాళి

**సుష్మా స్వరాజ్ సేవలు చిరస్మరణీయం**

**పట్టణ అధ్యక్షులు కొనాల గంగారెడ్డి**



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి పద్మ అవార్డు గ్రహీత తెలంగాణ చిన్నమ్మ సుష్మా స్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంలో ఎంతో కృషి చేసిందని తెలంగాణ విద్యార్థులకు ప్రజలకు భరోసనిస్తూ తెలంగాణను కళ్ళారా చూడాలని ఎవరు ఆత్మహత్యలు చేసుకోవద్దని విద్యార్థులకు ధైర్యం చెబుతూ. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పార్లమెంట్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టడానికి ఎంతో కృషి చేసిందని తెలంగాణ ప్రజలు ఆమెను తెలంగాణ చిన్న పిలవడం జరిగిందని అన్నారు.తెలంగాణ ఏర్పాటులో ఆమె ఎనలేని కృషి చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్,జిల్లా కౌన్సిల్ నెంబర్ ప్రసాద్,పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఉమేష్ బిజెపి నాయకులు చీకటి రాజు, పాశం భాస్కర్ రెడ్డి,శివ, శంకర్, అశ్విన్, మహేందర్, పురుషోత్తం, పద్మ నరేష్, భూమేష్,ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త, కీ.శే. ప్రొఫెసర్ జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను నిజామాబాద్ పోలీస్ శాఖ ఘనంగా నిర్వహించింది. నిజామాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ సార్ 1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేట గ్రామంలో జన్మించారని తెలిపారు. 1952లో జరిగిన ముల్కీ ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారని, 1954లో రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ముందు తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించారని గుర్తు చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ స్థాయికి ఎదిగిన జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి జీవితాంతం అంకితమయ్యారని అన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం కృషి చేసిన ఆయన, ముందుగా భౌగోళిక తెలంగాణ సాధించుకోవాల్సిన అవసరం ఉందని ఎప్పుడూ చెప్పేవారని పేర్కొన్నారు. "తెలంగాణ నా కల" అని ఆయన పదేపదే చెప్పేవారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని, భవిష్యత్ తరాల కోసం బంగారు బాట వేయాలని పోలీస్ శాఖ సిబ్బందికి అదనపు పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ నరేందర్, ఏఆర్ ఏసీపీ శ్రీరాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఏఓ ఆసియా బేగం, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు (అడ్మిన్) ధరణి కుమార్, (ఎంటీఓ) శేఖర్ బాబు, (వెల్ఫేర్) సతీష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలీస్ కార్యాలయ సిబ్బంది, సీసీఆర్‌బీ సిబ్బంది, సీఎస్‌బీ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కంప్లైంట్ సెల్ సిబ్బంది, భరోసా సెంటర్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# కాంగ్రెస్ లో చేరిన టీఎన్జీవో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన టీఎన్జీవో కామారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.సి. పోచయ్య గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సర్పంచ్ లోకని గంగమని గంగారం ఆధ్వర్యంలో, మత్స్య శాఖ జిల్లా నాయకుల సహకారంతో ఈ చేరిక కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మోత్కూరు నవీన్ గౌడ్ తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన సూచించారు. అయితే ఇదే సమయంలో ఇందల్వాయి గ్రామ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు తెరపైకి వచ్చాయి. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నాయకులు తాజా పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇతర పార్టీల నుంచి నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడం తమను అవమానించడమేనని కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందల్వాయి సింగిల్ విండో ఛైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డికి కూడా సమాచారం ఇవ్వకుండా కొందరు నాయకులు ఏకపక్షంగా గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలపై కార్యకర్తలకు పూర్తి స్పష్టత ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని గ్రామ సర్పంచ్ గంగమని గంగారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ప్రమోటర్ కస్పా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ ఛైర్మన్ బి. శ్రీనివాస్, బడ్సి ఎంపీటీసీ రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నవీన్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ కె. ఆనంద్, సర్పంచ్ గంగమని గంగారం, ఇందల్వాయి గ్రామ అభివృద్ధి కమిటీ వైస్ ఛైర్మన్ భాగిద్య నారాయణ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి రవి, పూజ్యం రవికుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తోట చిన్న రాజన్న, వై. ప్రసాద్, ఈర్ల సాయందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

## జయంతి వేడుకలో కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని ప్రశంసించారు. 1969 ఉద్యమంతో పాటు మలి విడత ఉద్యమం లోనూ ప్రజలను ప్రత్యేకించి విద్యార్థులు, యువతను ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగస్వామ్యం చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఆశ, శ్వాసగా ఆరు దశాబ్దాల పాటు సుదీర్ఘంగా అలుపెరుగని కృషి చేస్తూ ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోందని, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టారని అన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు అన్ని వర్గాల వారు సమిష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు కంటేశ్వర్ చౌరస్తాలో గల ఆచార్య జయశంకర్ విగ్రహానికి అదనపు కలెక్టర్ వి.భుజంగరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ప్రొఫెసర్ జయశంకర్ సేవలను శ్లాఘిస్తూ, జయంతి వేడుకలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారిణి రజిత, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.







# స్ఫూర్తిదాయకం ఈ దంపతులు



కోటగిరి, బతుకమ్మ :రుద్రూర్ గ్రామానికి చెందిన సాయి నిఖిల్ - శ్రావణి దంపతుల కుమారుడు వివాన్ సాయి జన్మదినం సందర్భంగా కోటగిరి మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామంలో గల అనాథ ఆశ్రమంలో పిల్లల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. అనంతరం అనాధాశ్రమంలో పిల్లలందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ విధంగా అనాధాశ్రమంలో తమ కుమారుడి జన్మదిన వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. బోధన్ పట్టణంలోని ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మేము తమ స్కూల్లో తల్లిదండ్రులు లేని పిల్లలను చూసి ఇటువంటి ఆలోచన వచ్చినట్లు తెలిపారు.

# కొండాపూర్ చెరువు కట్ట తెగిన ఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ



సిరికొండ, బతుకమ్మ :సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో చెరువు కట్ట తెగిన ఘటనపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో కొండాపూర్ గ్రామ శివారులోని చెరువు కట్టకు భారీగా గండి పడటంతో కట్ట తెగిపోయి, చెరువులోని నీరు పూర్తిగా బయటకు వెళ్లిపోయింది. ఈ ఘటనతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సంఘటన స్థలానికి చేరుకుని చెరువు కట్ట పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. చెరువు కట్ట తెగిపోవడానికి గల కారణాలు, నీటి ప్రవాహం దిశ, జరిగిన నష్టం, సమీప గ్రామాలపై ప్రభావం, ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఘటన అనంతరం పోలీసులు అప్రమత్తమై స్థానిక అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు సంచరించకుండా హెచ్చరికలు జారీ చేయాలని, అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు పికెట్లను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు చెరువులు, వాగులు, కాలువలు, వరద ప్రవాహ ప్రాంతాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలను నీటి వనరుల వద్దకు పంపవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే సంబంధిత పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సీఐ బిక్షపతి, సిరికొండ ఎస్ఐ జె.రామకృష్ణ, ధర్పల్లి ఎస్ఐ జి. సందీప్, గ్రామ సర్పంచ్ మానస శ్రీధర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# తె.యూ ఆర్ట్స్ కళాశాలలో ప్రొఫెసర్ జయంతి వేడుకలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ విశ్వవిద్యాలయం (తె.యూ.) ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మణాచారి, సీనియర్ ప్రొఫెసర్ కనకయ్య, విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి (పీఆర్వో) డాక్టర్ కె.వి. రమణాచారి, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన నిరంతర పోరాటం, త్యాగం, అంకితభావం చిరస్మరణీయమని కొనియాడారు. విద్యావేత్తగా, తెలంగాణ సిద్ధాంతకర్తగా ఆయన సమాజంలో చైతన్యం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. విద్యార్థులు ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, ఆలోచనలు, విలువలను తెలుసుకొని వాటిని జీవితంలో ఆచరించాలని వక్తలు సూచించారు. విద్య, సామాజిక బాధ్యత, ప్రాంత అభివృద్ధి పట్ల ఆయన చూపిన నిబద్ధతను ఆదర్శంగా తీసుకొని సమాజ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# బాధ్యతలు స్వీకరించిన ఇంచార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా

## స్వాగతం పలికిన అదనపు కలెక్టర్, అధికారులు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా ఇంచార్జి కలెక్టర్ గా భవేష్ మిశ్రా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.45 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న ఇంచార్జి కలెక్టర్ ను అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత తదితరులు సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్ కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ ను వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో సమావేశమై వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

## విద్యార్థులకు బంగారు బాట చూపాలి

**జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్**



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాట చూపే విధంగా అధ్యాపకులు బోధన చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ అధ్యక్షతన అధ్యాపకులకు రెండు రోజుల ఓరియంటేషన్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యా బోధన చేయాలని అన్నారు. తెలుగు, హిందీ, సివిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్ట్ లలో జరుగుతున్న శిక్షణ తరగతులకు జిల్లాలోని పలు ప్రాంతాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రొఫెసర్ జయశంకర్ జన్మదినం సందర్భంగా విద్య అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, పలువురు అధ్యాపకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.



## జయశంకర్ బీసీ బిడ్డ కావడం గర్వకారణం

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్**



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆచార్య జయశంకర్ సార్ సిద్ధాంతాలు, మార్గదర్శకత్వం లేకపోతే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమయ్యేది కాదన్నారు. జయశంకర్ సార్ ఒక బీసీ బిడ్డ కావడం ప్రతి బీసీ సమాజానికి గర్వకారణమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ఆత్మగౌరవ పోరాట పథ నిర్దేశకుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా గురువారం నగరంలోని కంటేశ్వర్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఆచార్య జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి అందించిన సైద్ధాంతిక భరోసా, ఆయన నిస్వార్థ సేవలను స్మరించుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన సుమారు 1,200 మంది అమరవీరుల్లో అత్యధికులు బీసీ వర్గాలకు చెందిన వారేనని అన్నారు. తెలంగాణ నిర్మాణంలో బీసీల పాత్రను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, అపర్ణ, చంద్రకాంత్, శ్రీనివాస్, నరసయ్య, రేఖ, అనిల్, సత్యనారాయణ, సదానంద్ తదితర బీసీ సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మికులకు పెయిడ్ హాలిడేస్ కల్పించడం లేదు

**యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఈశ్వర్ రావు**



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నెలకు 12 – 13 డ్యూటీలు నిర్వహిస్తున్నప్పటికీ పెయిడ్ హాలిడేస్ కల్పించడం లేదని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఈశ్వర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయుఈఈయు – సీఐటీయూ) నిజామాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షులు నల్లోర్ నరేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ రంగంలోని ఆర్టిజన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సబ్‌స్టేషన్లలో కనీస సౌకర్యాలైన బాత్‌రూములు లేకపోవడం, యార్డ్ లైటింగ్ ఏర్పాటు చేయకపోవడం, కంట్రోల్ రూములు శిథిలావస్థలో ఉండటం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఆర్టిజన్ కార్మికులకు గతంలో నిర్వహించిన బదిలీల ప్రక్రియను గత రెండు సంవత్సరాలుగా నిలిపివేయడం వల్ల అనేక మంది కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియను పునరుద్ధరించాలని సమావేశం కోరింది. అదే విధంగా ఓఅండ్‌ఎం సిబ్బంది, ఏఈలు, ఆపరేటింగ్ ఆర్టిజన్‌ల మధ్య సమన్వయ లోపం కారణంగా అనవసర విభేదాలు ఏర్పడుతున్నాయని, యాజమాన్యం జోక్యం చేసుకొని సిబ్బంది మధ్య సమన్వయంతో పని చేసే వాతావరణం కల్పించాలని సమావేశం అభిప్రాయపడింది. వైటీపీఎస్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను సమావేశం తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను పరిరక్షించేందుకు ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 10వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్న "జైల్ భరో" కార్యక్రమంలో టీజీయుఈఈయు పూర్తి స్థాయిలో పాల్గొనాలని సమావేశంలో నిర్ణయించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శినలవాల స్వామి మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి గంగాధర్, జిల్లా నాయకులు మురళి, మహేష్, థామస్, రమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు.

# చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం రైతుల ఉద్యమం

**9న జరిగే సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపు**




నిజామాబాద్ రూరల్, బతుకమ్మ :16 సంవత్సరాలుగా మూతపడిన ఎన్‌సీఎస్‌ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని రైతు నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 9న చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించనున్న రైతు సమ్మేళనంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. చెరుకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం అర్సపల్లి గ్రామ కచేరి వద్ద రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చెగంటి గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు సిర్ప నాగయ్య, జిల్లా కన్వీనర్ ఆకుల పాపయ్య మాట్లాడారు. సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో రైతులు షేర్ల రూపంలో రూ.2.94 కోట్లు సమకూర్చగా, ప్రభుత్వం రూ.50 లక్షల మూలధనం అందించిందని వారు తెలిపారు. ఫ్యాక్టరీ ప్రారంభమైన తర్వాత సుమారు 6 వేల మంది రైతులు చెరుకు సాగు చేసి సరఫరా చేశారని, మరో 5 వేల మంది వ్యవసాయ కూలీలు, కార్మికులకు ఉపాధి లభించిందని పేర్కొన్నారు. అయితే పాలకుల నిర్లక్ష్య విధానాలు, అధికారుల అవినీతి కారణంగా రైతులకు, కార్మికులకు ఉపయోగపడిన ఈ ఫ్యాక్టరీ మూతపడిందని వారు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరుకు సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, అందుకు ప్రభుత్వం నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో కొట్టె గంగాధర్ మాట్లాడుతూ దేశంలో బెల్లానికి మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని బెల్లం తయారీ కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆరుతడి పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నందున, చెరుకు కూడా ఆరుతడి పంట కావడంతో ఫ్యాక్టరీ ప్రారంభంపై ప్రభుత్వం రైతులకు భరోసా ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ చెగంటి గంగాధర్, కొట్టె గంగాధర్, కే. గోపాల్, బి. సాయిలు, టేక్మాల్ లక్ష్మణ్, డాక్టర్ రాజన్న, బట్టి గంగాధర్, ఎర్ర అబ్బయ్య, దేశాయిపేట్ ఒడ్డెన్న, ముచ్చుగూర్ లింబాద్రి, గంగాధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# నెలలు నిండని శిశువుకు 108 అండ

**మూడు గంటల ప్రయాణంలో ప్రాణ రక్షణ**

కామారెడ్డి, బతుకమ్మ :అత్యవసర పరిస్థితిలో ఉన్న ఓ నెలలు నిండని శిశువును 108 నియోనేటల్ అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి సురక్షితంగా తరలించారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన బుర్ర స్రవంతి రెండవ కాన్పులో భాగంగా 7 నెలల గర్భిణిగా ఉన్న సమయంలో గత నెల 8వ తేదీన కడుపు నొప్పితో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ సాధారణ కాన్పు జరగగా మగ శిశువు జన్మించాడు. అయితే శిశువు బరువు కేవలం 1.4 కిలోలు ఉండటంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో శిశువును ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 12 రోజుల పాటు చికిత్స అందించారు. తర్వాత శిశువు పరిస్థితి కొంత మెరుగుపడటంతో ఇంటికి తీసుకెళ్లారు. అయితే తిరిగి శిశువుకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పాలు తాగకపోవడం, ఏడుపు లేకపోవడం వంటి లక్షణాలు కనిపించడంతో కుటుంబ సభ్యులు మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా మెరుగైన చికిత్స అవసరమని భావించి శిశువును హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ సమయంలో శిశువుకు శ్వాస ఇబ్బందులతో పాటు ఫిట్స్ రావడంతో 108 నియోనేటల్ అంబులెన్స్ ద్వారా తరలింపు చేపట్టారు. కామారెడ్డి నుంచి నీలోఫర్ ఆసుపత్రి వరకు సుమారు 3 గంటల 30 నిమిషాల ప్రయాణంలో శిశువుకు అంబు బ్యాగ్ ద్వారా నిరంతరంగా శ్వాస సహాయం అందిస్తూ, ఆక్సిజన్, ఐవీ ద్రావణాలు అందించారు. 108 సిబ్బంది ఈఎంటీ కృష్ణ స్వామి, పైలట్ విజయ్ కుమార్‌లు అప్రమత్తంగా వ్యవహరించి శిశువును ఎలాంటి ఆటంకాలు లేకుండా సురక్షితంగా నీలోఫర్ ఆసుపత్రికి చేర్చారు. శిశువు తండ్రి చంద్రాగౌడ్ 108 అంబులెన్స్ సిబ్బంది అందించిన అత్యవసర సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.



# దళితులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

అల్లాదుర్గం, బతుకమ్మ :రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించినప్పటికీ కుల వివక్ష ఇంకా కొనసాగుతోందని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లాదుర్గం మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ బలరాంపై, అలాగే పలువురు దళిత నాయకులపై గ్రామ సర్పంచ్ భర్త సురేష్ గౌడ్, ఆయన కుటుంబ సభ్యులు దాడి చేసి, కులం పేరుతో దూషించారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై స్పందించిన ఉమ్మడి మెదక్ జిల్లా దళిత సంఘాల నాయకులు, సంగారెడ్డి జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దేవరాజు మాట్లాడుతూ, దాడికి పాల్పడిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై తక్షణ చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన దళితులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్, బతుకమ్మ : ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా నాంపల్లిలోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన నివాళి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం, ఆచార్య జయశంకర్, గద్దర్ జీవితాలు ప్రజాస్వామ్య మార్గంలో సామాజిక మార్పు సాధ్యమని నిరూపించాయని అన్నారు. వారి ఆశయాలు, స్ఫూర్తితో సమాజ పరివర్తన కోసం నిరంతరం కృషి చేయాలని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం సాధారణ ప్రజలు చేసిన అసాధారణ ఉద్యమమని ఆయన పేర్కొన్నారు. ఆరు దశాబ్దాలపాటు ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేస్తూ తెలంగాణ భావజాలాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. అలాగే మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన పాటల ద్వారా తెలంగాణ ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి ఊపిరి పోసిన వ్యక్తి గద్దర్ అని గుర్తుచేశారు. ఆచార్య జయశంకర్, గద్దర్ జీవితాలు ప్రజాస్వామ్య విలువలు, ప్రజా ఉద్యమాలకు చిరస్మరణీయ స్ఫూర్తిగా నిలిచాయని కోదండరాం అన్నారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థులు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాలు కూడా ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం సాధారణ యువత ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. తెలంగాణ ఉద్యమ ఆశయాలను కొనసాగిస్తూ సమగ్ర, ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం కోసం ప్రజలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.







# ఓబీసీ జాతీయ మహాసభలకు బయలు దేరిన బీసీ ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : బెంగళూరులో నిర్వహించనున్న 11వ ఓబీసీ జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు నిజామాబాద్ జిల్లా నుంచి దాదాపు 70 మంది బీసీ ప్రతినిధులు గురువారం బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నగర మేయర్ కూరగాయల ఉమా రాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్ జెండా ఊపి వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ సంఘీభావం ప్రకటించారు. మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీలకు




రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన చారిత్రాత్మక రోజైన ఆగస్టు 7ను పురస్కరించుకుని ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో ఓబీసీ మహాసభలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది 11వ ఓబీసీ జాతీయ మహాసభలను బెంగళూరులో నిర్వహిస్తున్నారు. ఈ మహాసభల్లో పాల్గొనేందుకు నిజామాబాద్ జిల్లా నుంచి బయలుదేరిన బీసీ ప్రతినిధులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, బీసీల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం సాధనకు ఇటువంటి మహాసభలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు, ఆర్టీసీ శ్రీనివాస్, కొయ్యాడ శంకర్, అపర్ణ, చంద్రకాంత్, నరసయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమం

## కార్మిక సంఘాల పిలుపు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు బి. భూమయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఓమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానాన్ని అవలంబిస్తోందని ఆరోపించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమా న్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని, రైతుల పంటలకు చట్టబద్ధమైన



కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జైల్ భరో కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 10న జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలతో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు హన్మండ్లు, శివకుమార్, మల్లికార్జున్, కిరణ్, విటల్, గోవర్ధన్, భాను నర్సయ్య, సాయిలు, అలీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

నందిపేట, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి, ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా నందిపేటలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నందిపేట గ్రామ సర్పంచ్ ఎర్రం లింగం, జేఏసీ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ చిత్రప టాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ అం దించిన సైద్ధాంతిక మార్గదర్శకత్వం, గద్దర్ తన పాటలు, ప్రజా ఉద్యమాల ద్వారా చేసిన సేవలను వారు స్మరిం చుకున్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం వీరిద్దరూ చేసిన కృషి చిరస్మరణీయమని వక్తలు పేర్కొ న్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్కు ఘన నివాళులు అర్పించారు.



# ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్, బతుకమ్మ :ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో మేధావుల విభాగం కీలక పాత్ర పోషించాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గాంధీ భవన్‌లో టీపీసీసీ మేధావుల విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై పార్టీ సంస్థాగత బలోపేతం, మేధావుల విభాగం విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మేధావులు ముందుండాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మేధావుల భాగస్వామ్యాన్ని మరింత విస్తరించి, సమాజ నిర్మాణంలో వారి ఆలోచనలు, సూచనలు ఉపయోగపడేలా కార్యాచరణను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీ విధానాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, సామాజిక అంశాలపై మేధావుల సూచనలను స్వీకరించి ముందుకు సాగాలని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ ఇంటెలెక్చువల్ సెల్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ దావల్, వైస్ చైర్మన్ పుష్ప లక్ష్మణ్, టీపీసీసీ మేధావుల విభాగం రాష్ట్ర చైర్మన్ ఆనంతుల శ్యామ్ మోహన్‌తో పాటు రాష్ట్ర నాయకులు, మేధావుల విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు కోసం వచ్చిన మహిళతో అనుచిత వ్యవహారం

## ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ రైటర్ సస్పెన్షన్



వెబ్ డెస్క్, బతుకమ్మ :రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసు శాఖ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చే ఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబ కలహాలకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగినితో అనుచితంగా వ్యవహరించాడనే ఆరోపణల నేపథ్యంలో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ రైటర్ శంకర్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బీ. గితే సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. అనంతరం ఘటనపై ప్రాథమిక విచారణకు ఆదేశించిన ఎస్పీ, విచారణ నివేదిక ఆధారంగా శాఖాపరమైన చర్యగా శంకర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. సమాచారం ప్రకారం, కుటుంబ వివాదానికి సంబంధించిన ఫిర్యాదు కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళతో శంకర్ వ్యక్తిగత సంబంధం ఏర్పరచుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆమెను సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామ శివారులోని వ్యవసాయ పొలాలకు తీసుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయ పొలాల్లో వారిని గమనించిన రైతులు తమ పొలాల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నించడంతో అక్కడ వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కొందరు రైతులు ఘటనను వీడియోలో చిత్రీకరించగా, ఆ వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. వైరల్ వీడియోల ఆధారంగా స్పందించిన జిల్లా పోలీసు అధికారులు ఘటనపై విచారణ చేపట్టి, ప్రాథమిక ఆధారాల మేరకు రైటర్ శంకర్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. అయితే, ఈ ఘటనపై పూర్తి వివరాలను పోలీసులు అధికా రికంగా వెల్లడించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, శంకర్‌పై గతంలో కూడా విధి నిర్వహణకు సంబంధించి వివాదాస్పద ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో కూడా శాఖాపరమైన చర్యలు ఎదుర్కొన్నాడని సమాచారం. ఈ ఘటనపై స్థానికులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తూ, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల విశ్వాసాన్ని కాపాడటం పోలీసు శాఖ బాధ్యత అని పేర్కొంటున్నారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని వారు కోరుతున్నారు.

# మాధవపల్లి ప్రాథమిక పాఠశాలలో జయశంకర్ జయంతి వేడుకలు



కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా గాంధారి మండలం మాధవపల్లి ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోచయ్య మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మేధావిగా జయశంకర్ సేవలను ఆయన స్మరించుకున్నారు. ఆచార్య జయశంకర్ ఆశయాలను భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీజ, ఉపాధ్యాయులు మౌనిక, సువర్ణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## జయశంకర్ సార్ ఆశయాలే తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకం

**రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్**



బాన్సువాడ, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ఆయన విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా కాసుల బాలరాజ్ మాట్లాడుతూ, జయ శంకర్ సార్ చూపిన మార్గం, ఆయన ఆశయాలు నేటికీ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం జయశంకర్ సార్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణం, సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.జయశంకర్ సార్ కలలుగన్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి, విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధా న్యం ఇస్తోందని తెలిపారు. ఆయన ఆశయాలను కార్యరూపంలోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.జయశంకర్ సార్ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ ప్రజాప్ర తినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో జయశంకర్ జయంతి

**బీఆర్ఎస్ నేతల ఘన నివాళులు**

**జయశంకర్ ఆశయాలతోనే తెలంగాణ సాకారం**

**మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్**



బాన్సువాడ, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా బాన్సువాడలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాలు, మాం దర్శకత్వమే తెలంగాణ రాష్ట్ర సాధనకు పునాదిగా నిలిచాయని అన్నారు. ఆ ఆశయాలను బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ రూపంలో ముందుకు తీసుకెళ్లడంతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆత్మగౌరవం, అభివృద్ధి, ప్రజా సంక్షే మానికి కేసీఆర్ అనేక కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు. జయ శంకర్ ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉంటుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఫెరోజ్ ఖాన్, ఖలీల్, మాక్బూల్, మాజీ కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు అక్బర్, నాయకులు అబ్దుల్ ఖాదర్, రమేష్ యాదవ్, మోచి గణేష్, అతీఫ్ అజీమ్, లాయక్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రం లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం తెలంగాణ ఉద్యమ కర్త, తెలంగాణ స్ఫూర్తి ప్రదాత ఆచార్య జయ శంకర్ 92 వ జయంతి వేడుకలను గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్, జూనియర్ అసిస్టెంట్ నవ్యత, తెలంగాణ ఉద్యమ కారుడు ఓబుల సాయన్న, బచ్చు పండరి, జయమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం నా బాధ్యత

**మెగా జాబ్ మేళాతో 2 వేలకు పైగా ఉద్యోగాలు**

**నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆర్మూర్ రోడ్ లో గల శ్రీరామ గార్డెన్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో 60 కి పైగా ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రధానంగా 2 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమలకు నిరుద్యోగులకు మధ్య వారధిగా నిలిచి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిజామాబాద్ యువతలో ఎంతో ప్రతిభ ఉందని, వారికి సరైన మార్గదర్శనం అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు ప్రముఖ కంపెనీలను నేరుగా ఇందూరుకు తీసుకురావడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి అభ్యర్థి బయోడేటా విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులు, ఆధార్ కార్డు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో ఉదయం 9 గంటల నుంచి హాజరుకావాలని కోరారు. అలాగే జాబ్ మేళా కు సహకరిస్తున్న కంపెనీలు, వాలంటీర్లు, భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ప్రొఫెసర్

**రాజన్న సిరిసిల్లా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**





రాజన్న సిరిసిల్ల, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసి, తెలంగాణ ఆకాంక్షను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పేర్కొన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను దేశ, విదేశాల్లో చాటిచెప్పి, ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యపరిచిన విశిష్ట వ్యక్తిగా ఆయన నిలిచారన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన స్ఫూర్తితో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి, ప్రజల మన్ననలు పొందేలా కృషి చేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ మొగిలి, ఆర్ఐలు సురేష్, రమేష్, ఏఓ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, కార్యాలయ సూపరింటెండెంట్లు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జయశంకర్ సార్ భావజాలమే ప్రేరణగా కలిసి నడుద్దాం




నిజామాబాద్ లీగల్, బతుకమ్మ కాలానానికి అనుగుణంగా కార్యాచరణ తీసుకుని తెలంగాణ భావజాలాన్ని సమాజంలో వెదజల్లిన జయశంకర్ సార్ అజరాముడని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠ రావు అన్నారు. జిల్లాకోర్టు సముదాయంలోని బార్ సమావేశపు హల్ లో జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బార్ ఉపాధ్యక్షుడు ఆవుల నారాయణ రావు,ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి,పుణ్యరాజ్, గణేష్ న్యాయవాదులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర పోరాటానికి పిడికెడు మంది నుండి ఒక మైదానంలో పట్టరాని మంది ముందు ఉపన్యసించి ఉగ్గుపాలతో ఉద్యమాన్ని ప్రజల మధ్య రగిలించిన మేధోసంపత్తి జయశంకర్ సొంతమని నీలకంఠ రావు పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను వ్యక్తులకు బోధించిన సార్ వ్యక్తుల సమూహాలను కూడదీసిందని ఆఖరికి అది ఉప్పెనలా కదిలివచ్చి తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి దారి తీసిందని తెలిపారు.సార్ ఆలోచనధారను తెలంగాణ రాష్ట్ర ప్రగతి నిర్మాణంలో దారిదీపంగా తీసుకువెళ్లాల్సిన గురుతర బాధ్యత నేటి బుద్ధిజీవులపై ఉన్నదని రావు అన్నారు. జయశంకర్ సార్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నడయాడిన గుర్తులు చెరిగిపోనివని గుర్తు చేశారు. బార్ ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి స్ఫూర్తివంతమైన జీవితాన్ని అందించి వెళ్లిన అమరుడు జయశంకర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఆకుల రమేష్, ఎర్రం గణపతి, శ్రీహరి ఆచార్య,కుమార్ దాస్, రాజ్ కుమార్ సుబేధార్, వి. భాస్కర్, తులసి దాస్, లాల్ బహదూర్ శాస్త్రి, చింతకుంట సాయిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, మధుసూదన్ రావు, మాణిక్ రాజు, యెండల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# గంటల వ్యవధిలో అదృశ్యమైన బాలుడిని గుర్తించిన కమ్మర్‌పల్లి పోలీసులు

**సాంకేతిక పరిజ్ఞానంతో బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత**



కమ్మర్‌పల్లి, బతుకమ్మ :అదృశ్యమైన ఓ బాలుడిని కేవలం గంటల వ్యవధిలోనే గుర్తించి, క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించి కమ్మర్‌పల్లి పోలీసులు తమ సమర్థవంతమైన పనితీరును చాటుకున్నారు. పోలీసుల వేగవంతమైన స్పందనపై స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన టేకు కృష్ణ ప్రసాద్ (15) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కమ్మర్‌పల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. సతీష్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు నరేష్, దినేష్, హరీష్‌లతో కూడిన బృందం బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. సీసీటీవీ కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు బాలుడి కదలికలను గుర్తించి ట్రాక్ చేశారు. ఈ క్రమంలో బాలుడు ఆర్మూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్నట్లు గుర్తించి, వెంటనే అక్కడికి చేరుకుని బాలుడిని సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రుల సమక్షంలో బాలుడిని వారికి అప్పగించారు. తమ కుమారుడు క్షేమంగా తిరిగి రావడానికి పోలీసులు చూపిన చొరవ, వేగవంతమైన చర్యలకు బాలుడి తల్లిదండ్రులు కమ్మర్‌పల్లి ఎస్సై సీహెచ్. సతీష్‌తో పాటు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు కూడా పోలీసుల పనితీరును ప్రశంసించారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సీసీటీవీ కెమెరాల ఆధారంగా బాలుడిని తక్కువ సమయంలో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన కమ్మర్‌పల్లి ఎస్సై సీహెచ్. సతీష్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు.

# హాలీవుడ్ క్రైం సిరీస్ స్ఫూర్తితో మర్డర్

వెబ్ డెస్క్, బతుకమ్మ : హాలీవుడ్ క్రైమ్ సిరీస్ చూసి భార్యను చంపాడు.. చివరకు పోలీసులకు ఎలా చిక్కాడంటే?హాలీవుడ్ క్రైమ్ వెబ్ సిరీస్ చూసి తాను వేసిన ప్లాన్ పోలీసులను మోసం చేస్తుందని భావించాడు. హత్యను ఆత్మహత్యలా కనిపించేలా సాక్ష్యాలను మార్చితే ఎవరూ తనపై అనుమానం పెట్టరని నమ్మాడు. కానీ నేరాన్ని ఎంత తెలివిగా దాచాలని ప్రయత్నించినా, సీసీటీవీ కెమెరాలు, ఇన్వెస్టిగేషన్, ఫోరెన్సిక్ ఆధారాల ముందు ఆ వ్యూహం నిలవలేదు. ఢిల్లీలో జరిగిన ఓ మహిళ హత్య కేసు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే దీనికి కారణం విని పోలీసులు నోరెళ్ళబెడుతున్నారు. ఎందుకంటే నిందితుడు హత్యకు ప్రేరణ పొందింది రియల్ సంఘటనల ఆధారంగా రూపొందిన హాలీవుడ్ క్రైమ్ సిరీస్ ‘ది స్టెయిర్‌కేస్’ నుంచి కావడమే.ఢిల్లీ షాహదరా జిల్లాలోని గగన్ విహార్ ప్రాంతంలో నివసిస్తున్న కమల్ సింగ్ అనే 53 ఏళ్ల వ్యక్తి తన భార్య కోమల్ సింగ్‌ను ఆస్తి వివాదం కారణంగా ముందుగానే పథకం వేసుకుని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జూలై 30 రాత్రి ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ రోజు ఇంటికి వచ్చిన దంపతుల కుమారుడు తన తల్లిని రక్తపు మడుగులో పడి ఉండగా గుర్తించాడు. ఆమె చేతిలో రక్తంతో తడిసిన కత్తెరను ఉంచిన తీరు చూసి మొదట ఇది ఆత్మహత్యలా కనిపించినా, తన తండ్రిపైనే కుమారుడికి అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.దర్యాప్తు ప్రారంభించిన షాహదరా జిల్లా పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించినప్పుడు పలు అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయి. కోమల్ సింగ్ చేతిలో ఉన్న కత్తెరతోనే హత్య జరిగిందనే అభిప్రాయం కలిగేలా నిందితుడు ప్రయత్నించినట్లు గుర్తించారు. అయితే ఫోరెన్సిక్ ఆధారాలు, ఇతర సాక్ష్యాలను పరిశీలించగా అసలు హత్యకు ఉపయోగించిన ఆయుధం కత్తి అని తేలింది. హత్యకు కొద్ది రోజుల ముందే కమల్ సింగ్ ఆ కత్తిని కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం దాన్ని బ్యాగులో దాచుకుని ఆధారాలు చెరిపేయడానికి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో సీసీటీవీ దృశ్యాలు కీలక పాత్ర పోషించాయి. ఉదయం దంపతుల ఇద్దరు పిల్లలు ఇంటి నుంచి వెళ్లిన తర్వాత ఇంట్లో కమల్ సింగ్, కోమల్ సింగ్ మాత్రమే ఉన్నట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. అనంతరం బాధితురాలి కేకలు వినిపించినట్లు నమోదైన దృశ్యాలు కూడా దర్యాప్తుకు బలమైన ఆధారాలుగా మారాయి. కొద్దిసేపటికే కమల్



సింగ్ బ్యాగులో ఆయుధాన్ని దాచుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిన దృశ్యాలు కూడా పోలీసులకు లభించాయి. దీంతో హత్య జరిగిన విధానం, నిందితుడి కదలికలపై స్పష్టత వచ్చింది.హత్య అనంతరం కమల్ సింగ్ తన బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.7 లక్షలు డ్రా చేసి పరారయ్యాడు. ఢిల్లీ నుంచి గోరఖ్‌పూర్ వైపు వెళ్లి అక్కడి నుంచి నేపాల్‌కు పారిపోవాలని మొదట ప్రణాళిక వేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే పోలీసులను తప్పుదారి పట్టించేందుకు అకస్మాత్తుగా తన ప్రయాణ మార్గాన్ని మార్చుకుని మథుర వైపు వెళ్లాడు. అయినప్పటికీ మొబైల్ ట్రాకింగ్ ఆధారంగా అతని కదలికలను పోలీసులు నిరంతరం గమనించారు. చివరకు మథుర రైల్వే స్టేషన్ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మొత్తం రూ.12.75 లక్షల నగదుతో పాటు హత్య అనంతరం పరారయ్యేందుకు ఉపయోగించిన స్కూటర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.విచారణలో కమల్ సింగ్ సంచలన విషయాలు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ ఆస్తుల విషయంలో చాలా కాలంగా వివాదం కొనసాగుతుండటంతో ముందుగానే హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు ఒప్పుకున్నాడు. హత్య జరిగినట్లు గుర్తించకుండా ఆధారాలను మార్చేందుకు ‘ది స్టెయిర్‌కేస్’ అనే హాలీవుడ్ క్రైమ్ సిరీస్ నుంచి ప్రేరణ పొందినట్లు కూడా అంగీకరించాడు. అసలు ఆయుధాన్ని దాచిపెట్టి, మరో కత్తెరను ఘటనాస్థలిలో ఉంచితే పోలీసులు తప్పుదారి పడతారని భావించినట్లు వెల్లడించాడు. అయితే నిందితుడు ఎంత పక్కాగా ప్రణాళిక వేసుకున్నా, ఇన్వెస్టిగేషన్ , ఫోరెన్సిక్ పరీక్షలు, సీసీటీవీ ఫుటేజ్ తో అతని వ్యూహాన్ని పూర్తిగా ఛేదించామని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ కేసులో ఫోరెన్సిక్ పరీక్షలు, మరిన్ని ఆధారాల సేకరిస్తున్నారు. ఈ ఘటన మరోసారి ఒక విషయాన్ని స్పష్టం చేసింది. సినిమాలు, వెబ్ సిరీస్‌లలో కనిపించే క్రైమ్ సీన్స్ నిజ జీవితంలో పనిచేస్తాయనే భావన తప్పు. ఇప్పుడున్న ఇన్వెస్టిగేషన్ స్కిల్స్ ముందు అలాంటి ప్రణాళికలు ఎక్కువకాలం నిలబడే అవకాశం లేదని ఈ కేసు స్పష్టంగా చూపిస్తోంది.

# విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే టీవీయూవీ లక్ష్యం

## టీవీయూవీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డా. నిజ్జన రమేష్ ముదిరాజ్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ప్రోత్సహించడమే అకాడమిక్ ఎక్సెలెన్స్ అవార్డుల ప్రధాన ఉద్దేశమని టీవీయూవీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డా. నిజ్జన రమేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయూవీ) దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా అకాడమిక్ ఎక్స్ లెన్స్ అవార్డుల ప్రధానోత్సవం గురువారం నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. వివిధ విద్యాసంస్థలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను అకాడమిక్ ఎక్స్ లెన్స్ అవార్డులతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆవిర్భావం నుంచి గత పదేళ్లుగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమాలు, సేవా కార్యక్రమాలను వివరించారు. ముఖ్య అతిథి డా. కవిత రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివితే విజయాన్ని తప్పకుండా సాధించగలరని అన్నారు. మహిళా విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. టీవీయూవీ దశాబ్ద కాలం పూర్తి చేసుకోవడం అభినందనీయమనీ, అవార్డు గ్రహీతలు ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డీఐఓ రవికుమార్ మాట్లాడుతూ కష్టపడి చదివితే విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను అభినందిస్తూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా. రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, టీవీయూవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అకాడమిక్ ఎక్సెలెన్స్ అవార్డుల కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని అన్నారు. అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అడ్వకేట్ ఆశ నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో టీవీయూవీ నాయకులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదివి నీట్, జేఈఈ మెయిన్స్, ఈఏపీసెట్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామవత్ లాల్ సింగ్ మాట్లాడుతూ, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి ఏడాది అకాడమిక్ ఎక్సెలెన్స్ అవార్డుల ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి సన్మానిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగించడంతో పాటు ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. టీవీయూవీ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని డిసెంబర్ నెలలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హభా అధ్యక్షులు విశ్వతేజస్ నవీన్, కావ్య, టీవీయూవీ జిల్లా అధ్యక్షులు రాంపూర్ అజయ్, నగర అధ్యక్షులు సుభాష్, వేణు, నిశ్వంత్, బన్ని, జస్వంత్, పందు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.








# సిద్దాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం

## రిజర్వాయర్ పూర్తైతే 10 వేల ఎకరాలకు శాశ్వత సాగునీటి



బాన్సువాడ, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండలంలోని సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులు, ఇంజినీర్లతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు బండ్లలో భాగంగా మొదటి బండ్ నిర్మాణంలో రెండు స్లూయిస్‌లు (తూములు) పూర్తయ్యాయని తెలిపారు. గతంలో సిద్దాపూర్ చెరువులో నిల్వ ఉండే నీటి పరిమాణంతో పోలిస్తే ప్రస్తుతం దాదాపు రెట్టింపు స్థాయిలో నీటి నిల్వ సాధ్యమైందని, కట్ట ఎత్తు సుమారు ఐదు మీటర్లు పెరగడంతో రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.రిజర్వాయర్ నిర్మాణం వల్ల సిద్దాపూర్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే ఆయకట్ట పరిధిలోని వ్యవసాయ భూములకు వానాకాలం, వేసవి పంటలకు అవసరమైన నీరు ఇప్పటికే నిల్వ ఉండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిన అనంతరం ఆయకట్ట పరిధిలోని సుమారు 10 వేల ఎకరాలకు సాగునీటి సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే పోచారం తెలిపారు.



# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

రుద్రూర్, బతుకమ్మ :మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో గల ఎం.పి.యు.పి.ఎస్. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ 320 బి, రీజియన్ 1, జోన్ 3 పరిధిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కొంపల్లి లైఫ్ స్పేసెస్, లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ డైమండ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రుద్రూర్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త బచ్చు రాము సెట్, రుద్రూర్ గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అంబం(ఆర్) గ్రామ సర్పంచ్ కుర్లేపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లె సాయి ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షులు బడే రాము, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జి.జి. కళాశాలలో ఘనంగా ప్రొఫెసర్ జయంతి వేడుకలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో బి.ఏ. విభాగాల ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రంగరత్నం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ ఎస్. రంగరత్నం మాట్లాడుతూ, “తెలంగాణ అస్తిత్వానికి జయశంకర్ స్ఫూర్తి ప్రదాత” అని



పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు తెలంగాణ విద్యార్థులు, యువత, ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు, మేధావి అయిన ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సుదీర్ఘ కృషి ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని అధ్యాపకులు రామస్వామి, రమేష్ గౌడ్,



సుధాకర్ తదితరులు వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జల సాధన సమితి వ్యవస్థాపకులు దుశర్ల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిజామాబాద్‌కు చెందిన సీనియర్ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ వినోద్ కుమార్ గుప్తా విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ. రామ్ కిషన్, సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్, పీఆర్ఓ డాక్టర్ దండు స్వామి, అధ్యాపకులు రమేష్ గౌడ్, రామస్వామి, రాహుల్, అనసూయ, సుభాషిణి దేవి, షేక్ చాంద్, దస్తప్ప, నాగజ్యోతి, వెంకటేశం గౌడ్, వెంకట కిషన్, శ్రీనివాస్, నరేందర్, సురేఖ, శమంత, వసంత, కే. గంగాధర్, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు

### గుడిసె కుటుంబం వద్దకు వెళ్లి వివరాలు సేకరించిన అధికారులు



బాన్సువాడ, బతుకమ్మ :కొల్లూర్ గ్రామంలో గుడిసెలో నివాసం ఉంటున్న ఓ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ చేసిన విజ్ఞప్తి మేరకు అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. కుటుంబ సభ్యులు నివసిస్తున్న గుడిసెను సందర్శించిన అధికారులు వారి నివాస పరిస్థితులు, కుటుంబ ఆర్థిక స్థితి, అర్హతలకు సంబంధించిన వివరాలను సేకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హత ఉంటే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, సర్పంచ్ నాందేవ్, కార్యదర్శి రాధిక, ఉప సర్పంచ్ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్రం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్



వేల్పూర్, బతుకమ్మ :తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని వేల్పూర్ ఏపీఎం బత్తుల మాణిక్యం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం వేల్పూర్ మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బత్తుల మాణిక్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసిన ఆయన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీల జిల్లా కోశాధికారి లక్ష్మి, సీసీలు వెన్న మురళీ, సాయన్న, సరళ, సునీత, దివ్య, రాజేందర్ పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు బీజేపీ ఘన నివాళి



బాన్సువాడ, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, ఆయన చూపిన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని నాయకులు కొని యాడారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం ఆయన జీవి తాంతం చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదా యకమని పేర్కొ న్నారు. ఈ కార్యక్ర మంలో బిజెపి జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్ బిజెపి పట్టణ ప్రధాన కార్య దర్శి చిరంజీవి ఉమేష్ బిజెపి నాయకులు చీకటి రాజు పాశం భాస్కర్ రెడ్డి శివశంకర్ పురుషోత్తం సచిన్ నరేష్ అశ్విన్ భూమేష్ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.కార్యదర్శి శంకర్ గౌడ్,జిల్లా కౌన్సిల్ నెంబర్ ప్రసాద్,పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఉమేష్ బిజెపి నాయకులు చీకటి రాజు, పాశం భాస్కర్ రెడ్డి,శివ, శంకర్, అశ్విన్, మహేందర్, పురుషోత్తం, పద్మ నరేష్, భూమేష్,ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటితో ముగియనున్న నోటీసుల గడువు

### ఎంఈఓ నాగేశ్వర్‌రావు



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రస్తుతం 8వ, 9వ, 10వ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతి లేదని మండల విద్యాధికారి పి. నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ విషయమై బతుకమ్మ పత్రిక ప్రతినిధి ఎంఈఓ పి. నాగేశ్వర్‌రావును వివరణ కోరగా, శ్రీ చైతన్య పాంశాలకు 8వ, 9వ, 10వ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతి లేదని తెలిపారు. ఈ మేరకు ఆగస్టు 4న యాజమాన్యానికి నోటీసులు జారీ చేశామని, రేపటితో మూడు రోజుల గడువు పూర్తవుతుందని చెప్పారు. అప్పటికీ అవసరమైన అనుమతులు పొందకుండా అనుమతి లేని తరగతులను కొనసాగిస్తే, సంబంధిత యాజమాన్యంపై విద్యాశాఖ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని ఎంఈఓ నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు.

# అటవీ భూముల ఆక్రమణలు ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తాయి

### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య






నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :అటవీ భూముల ఆక్రమణలు ప్రభుత్వ ఆస్తులకు, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే అంశమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లాలో అటవీ భూముల ఆక్రమణలను అరికట్టడం, ఇప్పటికే జరిగిన ఆక్రమణలను చట్టపరంగా తొలగించడం, అటవీ సంపదను సంరక్షించడం లక్ష్యంగా పోలీసు శాఖ, అటవీ శాఖ అధికారుల సమన్వయ సమావేశం గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ అండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీ, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. పోలీసు శాఖ, అటవీ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, డివిజనల్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అటవీ భూములపై అక్రమ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, భూమి మార్పిడి, చెట్ల నరికివేత, అక్రమ మైనింగ్, కలప అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అటవీ భూముల పరిరక్షణకు జియో ట్యాగింగ్, డ్రోన్ సర్వేలు, క్రమం తప్పని తనిఖీలు, ఆధారాల సేకరణ వంటి సాంకేతిక విధానాలను విస్తృతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా ఆక్రమణలు లేదా అక్రమ కార్యకలాపాల సమాచారం అందిన వెంటనే పోలీసు, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ మాట్లాడుతూ అటవీ భూములను రక్షించడం ప్రభుత్వ శాఖలతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అటవీ భూముల సరిహద్దుల గుర్తింపు, కేసుల నమోదు, కోర్టు వ్యవహారాల్లో సమన్వయం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో అటవీ భూముల ఆక్రమణలను గుర్తించి దశలవారీగా తొలగించేందుకు సంయుక్త కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించారు. అలాగే అక్రమ చెట్ల నరికివేత, కలప రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం, రెండు శాఖల మధ్య సమాచార మార్పిడిని వేగవంతం చేయడం, అవసరమైన ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు మరియు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం వంటి అంశాలపై చర్చించారు. అటవీ భూముల రక్షణలో డ్రోన్లు, జీపీఎస్ మ్యాపింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టి కొత్త ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ప్రజల్లో అటవీ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సహకారాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. రెండు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అటవీ భూముల సంరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రావు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్ పెక్టర్ లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్‌తో పాటు పోలీసు శాఖకు చెందిన సీఐలు, ఎస్సైలు, అటవీ శాఖకు చెందిన ఫారెస్ట్ రేంజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వైద్యంలో కొత్త మార్గం

### ఇంటర్వెన్షన్ రేడియాలజీతో శస్త్రచికిత్స లేకుండానే చికిత్సలు




హైదరాబాద్, బతుకమ్మ :ఆధునిక వైద్య రంగంలో ఇంటర్వెన్షన్ రేడియాలజీ ఒక విప్లవాత్మకమైన మార్పుకు కారణమవుతోంది. శరీరంపై పెద్ద కోతలు లేకుండా, కేవలం చిన్న సూది రంధ్రం ద్వారా అనేక క్లిష్టమైన వ్యాధులకు చికిత్స అందించే ఈ వైద్య విధానం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఎక్స్-రేలు, యాంజియోగ్రఫీ, సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్, ఎంఆర్ఐ వంటి ఆధునిక ఇమేజింగ్ సాంకేతికతలను ఉపయోగించి శరీరంలోని వ్యాధులను గుర్తించడమే కాకుండా అదే సమయంలో చికిత్స అందించడం ఇంటర్వెన్షన్ రేడియాలజీ ప్రత్యేకత. సాధారణ శస్త్రచికిత్సలతో పోలిస్తే ఈ విధానంలో పెద్ద కోతలు, కుట్లు అవసరం ఉండవు. దీంతో రోగులు తక్కువ నొప్పితో త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మెదడు రక్తనాళాల్లో ఏర్పడే సమస్యల చికిత్సలో ఇంటర్వెన్షన్ రేడియాలజీ కీలక పాత్ర పోషిస్తోంది. మెదడులోని రక్తనాళాలు మూసుకుపోవడం వల్ల స్ట్రోక్ సంభవించినప్పుడు, మెకానికల్ థ్రాంబెక్టమీ విధానం ద్వారా రక్తనాళాల్లోని అడ్డంకులను తొలగించి రక్తప్రసరణను పునరుద్ధరించవచ్చు. అవసరమైన సందర్భాల్లో యాంజియోప్లాస్టీ, స్టెంటింగ్ వంటి పద్ధతులను కూడా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల పక్షవాతం, మాట కోల్పోవడం వంటి తీవ్రమైన సమస్యలను తగ్గించే అవకాశం ఉంటుంది. అలాగే మెదడులోని రక్తనాళాలు బలహీనపడి ఉబ్బినప్పుడు ఏర్పడే అన్యూరిజమ్‌లకు కూడా ఇంటర్వెన్షన్ రేడియాలజీ ద్వారా చికిత్స అందిస్తున్నారు. కాయిలింగ్, స్టెంటింగ్ వంటి ఆధునిక విధానాలతో అన్యూరిజమ్ పగిలి ప్రాణాంతక రక్తస్రావం జరగకుండా ముందస్తు చికిత్స చేయవచ్చు. ప్రస్తుతం ఈ వైద్య విధానాలు మెదడు రక్తనాళాలకే పరిమితం కాకుండా ఊపిరితిత్తులు, పొత్తికడుపు, కాళ్ల రక్తనాళాల్లో ఏర్పడే అడ్డంకులు, రక్తస్రావ సమస్యల చికిత్సలోనూ విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా కణితులు, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, ప్రోస్టేట్ సమస్యలు, థైరాయిడ్ వ్యాధులు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు కూడా తక్కువ కోతతో కూడిన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ అభివృద్ధికి అమెరికన్ రేడియాలజిస్ట్ డాక్టర్ చార్లెస్ థియోడర్ డాటర్ చేసిన సేవలు ఎంతో కీలకమైనవి. 1964 జనవరి 16న తీవ్రమైన కాలి పుండుతో బాధపడుతున్న ఓ వృద్ధురాలి కాలి రక్తనాళంలో ఏర్పడిన అడ్డంకికి ఆయన మొట్టమొదటి శస్త్రచికిత్స రహిత యాంజియోప్లాస్టీ చికిత్సను నిర్వహించారు. ఈ విధానం ద్వారా ఆమె కాలును తొలగించాల్సిన పరిస్థితిని నివారించగలిగారు. ఈ ఘటనే ఆధునిక ఇంటర్వెన్షన్ రేడియాలజీకి పునాదిగా నిలిచింది. ప్రస్తుతం వైద్య సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఇంటర్వెన్షన్ రేడియాలజీ పరిధి మరింత విస్తరిస్తోంది. పెద్ద శస్త్రచికిత్సలకు ప్రత్యామ్నాయంగా, తక్కువ ప్రమాదంతో, వేగంగా కోలుకునే అవకాశాన్ని కల్పించే ఈ ఆధునిక చికిత్సా విధానాలు భవిష్యత్ వైద్య రంగంలో మరింత కీలక పాత్ర పోషించనున్నాయి. వివిధ వ్యాధులకు అందుబాటులో ఉన్న తక్కువ కోతతో కూడిన చికిత్సల గురించి తెలుసుకునేందుకు రోగులు ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్‌లను సంప్రదించవచ్చు.

# ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరాల్లో వైద్య సేవలను బలోపేతం చేయాలి

### సీహెచ్‌ఎఫ్ డబ్ల్యూ సంగీత సత్యనారాయణ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరాల్లో అందుతున్న వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని, క్వాలిటీ అష్యూరెన్స్ ద్వారా గుర్తించిన ఆమ్ సెంటర్లు, పీహెచ్‌సీలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని సీహెచ్ ఎఫ్ డబ్ల్యూ సంగీత సత్యనారాయణ అధికారులకు ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై గురువారం రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఎంహెచ్ఓలు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రాం అధికారులతో జూమ్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశానికి సీహెచ్ ఎఫ్ డబ్ల్యూ సంగీత సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రత్యేక నిర్ధారణ శిబిరాలు నిర్వహించి, అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేయాలని సూచించారు. అవసరమైన వారికి ఎక్స్ రే పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేపట్టాలని, అర్హులైన క్షయ బాధితులకు డీబీటీ పారితోషికాన్ని వారం లోపు అందించాలని తెలిపారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ద్వారా నిర్ధారణ పరీక్షల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వివిధ శాఖల సమన్వయ సమావేశాలు నిర్వహించడం, జ్వర సర్వేలు చేపట్టడం, ఫాగింగ్, యాంటీ లార్వల్ సర్వైలెన్స్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. టీకాల ద్వారా నివారించగల వ్యాధుల నియంత్రణకు అనుమానిత కేసుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించాలని తెలిపారు. మాతా శిశు ఆరోగ్య సేవలపై సమీక్షిస్తూ 12 వారాల్లోపు గర్భిణీల నమోదు, కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, ప్రసవ ప్రణాళిక వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గర్భిణీలందరికీ హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జీవనశైలి వ్యాధుల నియంత్రణలో భాగంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డుల జనరేషన్‌ను పెంచాలని, హైపర్‌టెన్షన్, డయాబెటిస్ వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలను విస్తృతం చేయాలని తెలిపారు. ఎన్‌సీడీ, ఎంసీహెచ్, యూవిన్, ఆమ్ పోర్టల్‌లలో డేటా నమోదు పూర్తి స్థాయిలో ఉండాలని, ఏబీఎఎస్ హాజరు విధానాన్ని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. టీకాల ద్వారా నివారించగల వ్యాధుల నియంత్రణలో భాగంగా పోలియో, మీజిల్స్ అనుమానిత కేసుల నమూనాలను సేకరించి పంపించాలని తెలిపారు. అదేవిధంగా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలులో భాగంగా ఫారం-ఎఫ్ ఆడిట్ నిర్వహించాలని, అన్ని ఆసుపత్రుల్లో రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. బ్లడ్ సెల్ ద్వారా అవసరమైన వారికి సకాలంలో రక్తం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీటీసీవో డాక్టర్ దేవి నాగేశ్వరి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అశోక్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ శిఖర, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శ్రావ్య, ఎస్ఓ రాజేశ్వర్, డీపీఓ విశాల, డీహెచ్ఈ ఘనపూర్ వెంకటేశ్వర్లు, డీడీఎం నారాయణ, డీపీఎం సుధాకర్, గోవర్ధన్, లక్ష్మణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసం రైతు కమిషన్ నిరంతరం కృషి చేస్తుంది

## వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి







నిర్మల్, బతుకమ్మ :రైతుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, వ్యవసాయ రంగ అభివృద్ధికి కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని, రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి తగిన సూచనలు అందిస్తామని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పర్యటనలో భాగంగా తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు సునీల్ కుమార్, రాములు నాయక్, మరికంటి భవాని రెడ్డి, కె.వి.ఎన్. రెడ్డి, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గౌరవ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, రెవెన్యూ అధికారులు, రైతులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషన్ సభ్యులు అధికారులతో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా వ్యవసాయ సమస్యలు, మార్కెట్ సదుపాయాలు, పోడు భూముల సమస్యలు, భూ సంబంధిత అంశాలు, రెవెన్యూ సమస్యలపై వివరాలను సేకరించారు. సమావేశంలో రైతులు తమ సమస్యలను కమిషన్ చైర్మన్, సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. రైతుల అభ్యర్థనలను శ్రద్ధగా విన్న కమిషన్ సభ్యులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ, ఉద్యానవన రంగాల్లో అందుతున్న సేవలు, పంటల సాగు, మార్కెటింగ్ విధానం, పంటలకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ యార్డుల్లో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. పోడు భూములు, భూ హక్కులు, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషన్ సూచించింది. రైతుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

## తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

### మోర్తాడ్ బీఆర్ఎస్ నేతలు



మోర్తాడ్, బతుకమ్మ :బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిపై ముత్యాల సునీల్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను మోర్తాడ్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రశాంత్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన కొద్దిపాటి పనులను సాకుగా చూపిస్తూ వాటికి సంబంధించిన బిల్లులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా అభివృద్ధి పనులు, బిల్లుల విషయంలో జాప్యం జరుగుతోందని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రశాంత్ రెడ్డికి మంచి పేరు రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం మానుకుని వాస్తవాలను ప్రజలకు వివరించాలని ముత్యాల సునీల్ రెడ్డికి సూచించారు. అధికార పార్టీ పేరుతో అధికారులకు ఆదేశాలు ఇస్తూ పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని, నియోజకవర్గ ఎమ్మెల్యేలకు రావాల్సిన సీడీపీ నిధులను నిలిపివేసి వాటిని ఎస్‌డీఎఫ్ పేరుతో మళ్లిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గాన్ని ప్రశాంత్ రెడ్డి పదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశారని, ఆయనపై చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కల్పించడం, ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేయడం కొనసాగిస్తే బీఆర్ఎస్ పార్టీ ప్రజల ముందు కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఎండగడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మోర్తాడ్ మండల అధ్యక్షుడు కల్లెడ ఎలియా, సర్పంచ్ ఆనంద్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, పాపాయి పవన్, పర్స దేవన్న, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, అశోక్, ఇంత్యాజ్, గంధం మహిపాల్, సామ శ్రీను, ఏనుగు రాజేశ్వర్, తౌషిఫ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూనగర్ శివారులో 60 గ్రాముల గంజాయి స్వాధీనం




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నిజామాబాద్ ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ శివారులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 60 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నెహ్రూనగర్ శివారులోని వాటర్ ట్యాంక్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో ఆరవ టౌన్ ఎస్సై కె. సందీప్ పోలీసు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పరార య్యేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు అబ్దుల్ జియా, షిండే అక్షయ్ కుమార్‌గా గుర్తించారు. నిందితులు మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి ప్యాకెట్లను కొనుగోలు చేసి నిజామాబాద్ శివారులో గుర్తుతెలియని వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అదే క్రమంలో గురువారం నెహ్రూనగర్ శివారులో అక్షయ్‌కు చెందిన ఆటోలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 60 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఆరవ టౌన్ ఎస్సై కె. సందీప్‌తో పాటు ఎస్సై నారాయణ్ సింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దేవి గడ్ తాండాకు రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రం అందజేత



ఇందల్వాయి, బతుకమ్మ:ఇందల్వాయి మండలంలోని దేవి గడ్ తాండా గ్రామ అభివృద్ధికి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంజూరు ఉత్తర్వుల (ప్రొసీడింగ్) పత్రాన్ని గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేగులపల్లి భూపతిరెడ్డి గ్రామ సర్పంచ్ గణేష్ నాయక్‌కు అందజేశారు. దేవి తాండా గ్రామంలోని జగదాంబ మాత ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం షెడ్ నిర్మాణం కోసం ఈ నిధులను కేటాయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నా మని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక సర్పంచ్ గణేష్ నాయక్‌తో పాటు గ్రామస్తులకు ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. గ్రామ అభివృద్ధి పనులకు సహకరిస్తామని గ్రామ పెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోష్, తాండా పెద్దలు కైలాష్, వసంత్ రావు, లక్ష్మణ్, చంద్రు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ భవన్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

### ఘన నివాళులర్పించిన కేటీఆర్



హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గండ్ర వెంకటరమణ, బానోత్ శంకర్ నాయక్, కోరుకంటి చందర్, మెతుకు ఆనంద్, బిగాల గణేష్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు నివాళులర్పించారు.

